# తుఫాను

— ఎల్.ఆర్. స్వామి

సుమ ఇంకా రాలేదేం?

చదువుతున్న పుస్తకంలోంచి తలయెత్తి చూశాను — సమయం ఐదు గంటల పది నిముషాలు.

రోజూ ఈ వేళకి వచ్చేసేది. కిటికీ తలుపులు తీసి చూశాను. చల్లని గాలి మొహానికి తగిలింది. దూరం నించీ వర్షపు మబ్బు తునకలు ప్రపంచాన్ని కలుసుకోవడానికి వస్తున్నాయి — కానీ సుమ జాడ లేదు.

నా గదిలో నిశ్శబ్దత — అలవాటుపడని నిశ్శబ్దత. వచ్చి కుర్చీలో కూలబడ్డాను. ఎదురుగా అప్పుడే పూర్తిచేసిన గేయం కనిపిస్తోంది. యథాలాపంగా తీసి మరో సారి చదివేను. ఆ గేయంలోని పదాలకి సుమకి వున్న అందం లేదనిపించింది. పెన్ను తీసి శ్రద్ధగా దిద్దేను — ఇప్పుడు కొంచెం బాగుంది.

చినుకులు మొదలయ్యాయి. గ్రీష్మ కాలపు ఎండకు ఎండిపోయిన ప్రపంచం తొలకరి చినుకులకు పులకరించి పోతోంది. సుమ ఇంక ఈవేళ రాదా?!

చాలా రోజుల నుంచి అడుగుతోంది తన మీద ఒక గేయం వ్రాయమని ఆఖరికి రాశాను ఈ రోజు.

మరోసారి ఆ గేయాన్ని చదివేను. బాగానే వుంది. గానీ, ఎంత ప్రయత్నించినా ఆమె అందాన్ని పదాలలో బంధించ లేకపోయాననే అనిపిస్తోంది.

వాన ఎక్కువయినట్టుంది. జల్లు లోపలికి వస్తోంది. ఇలా వాన కురుస్తుంటే ఇక సుమ ఎలా వస్తుందీ రోజు?

నా మీద నాకే కోపం వస్తోంది. ఛీ .. ఈ గేయం నిన్ననే వ్రాయాల్సింది. నిన్నయితే వర్షం లేదు.

* * *

సుమారు వారం రోజుల క్రితం ఏదో పాటని సన్నగా గొణుగుతూ పరు గెత్తుతూ వచ్చింది సుమ. "మా అమ్మ అడిగింది రోజూ ఎందుకు మాస్టారి గదిలో కెళుతున్నావని?"

"నువ్వేం చెప్పావు?" నేను నవ్వుతూ అడిగేను.

"ఇంకేం అంటాను? నాకు మాస్టా రన్నా, మాస్టారి గేయాలన్నా ఇష్టమనే!

"ఎలాంటి ఇష్టం?" అని అడగాలని పించింది గానీ, సుమ వైపు చూస్తుంటె నా మాటలు ఎన్ను వదలి వెళ్తున్నట్టనిపించాయి.

"మా అమ్మ ఏమందో తెలుసా? నువ్వేం చిన్నపిల్లవి గాదు. వయసొచ్చిన దానివి. మాస్టారెంత మంచివారైనా, అతని వయస్సు పలభై దాటినా, నువ్వు జాగ్రత్తగా మసలాలి. అస్తమానం అలా వెళ్ళకూడదు" అంది. సుమ గట్టిగా నవ్వుతూ చెప్పింది.

"అలా అయితే మీ అమ్మ దగ్గరే కూర్చోక పోయావా? నా దగ్గరి కెందు కొచ్చావు?" నేను కోపం దాచుకోలేక పోయాను.

సుమ అందంగా నవ్వి "కోపం తెచ్చు కోకండి మాస్టారూ. పలభై దాటితేనేమి? మీరు కుర్రాడిలాగానే కనిపిస్తున్నారు" నా భుజం మీద చెయ్యి వేసి చెప్పింది.

ఆ తొలి స్పర్శకి వళ్ళంతా పులకరించింది. అనిర్వచనీయమైన ఒక అనుభూతి ఆమె చేతిని అలాగే గట్టిగా పట్టుకోవాలనిపించింది. గాని శిలలా నిల్చుండిపోయాను. నా యవ్వనం ఏనాడో నాకు సెలవు చెప్పి వెళ్ళిపోయిందనే నిజం మళ్ళా ఒక్కసారి గుర్తుకొచ్చింది.

సుమ పసిపాపలా నవ్వి దూరంగా వున్న టేబిల్ వైపు వెళ్ళిపోయింది. టేబిల్ మీది కాగితాలు అటూ, ఇటూ తిప్పి చూస్తూ అడిగింది "కొత్తగా ఏం వ్రాయలేదా?"

లేదని తల వూపేను. ఎన్నో రోజులైంది. కొత్తగా యేమన్నా వ్రాసి వ్రాయాలనుకొన్నప్పుడల్లా సుమే గుర్తు కొస్తోంది. వ్రాయలేక పోతున్నాను.

"ఇదేం బాగో లేదు మాస్టారూ, మీకు బద్ధకం ఎక్కువైపోతోంది" టేబిల్ పై నున్న పత్రిక పేజీలు తిరగ వేస్తూ అంది సుమ.

నేనేం మాట్లాడలేదు. కిటికీలోంచి అస్తమిస్తున్న సూర్యుణ్ణే చూస్తూ నించు న్నాను.

"నా మీద ఓ గేయం వ్రాయరూ" గోముగా అడిగింది.

నేను సమాధానం చెప్పేలోగానే "రేపు వస్తాను మేస్టారు" అంటూ గెంతుతూ వెళ్ళిపోయింది.

* * *

టేబిల్ మీది కాగితాలు గాలికి రెప రెపలాడుతున్నాయి! సుమ కళ్ళ ముందు కదుల్తోంది! సుమ వయస్సులో నేను వున్నప్పుడు! నేను దాటిన జీవితంలో వసంత కాలం గుర్తుకొచ్చింది.

* * *

"ఒరేయ్ సీతకి సంబంధాలు చూస్తున్నామని మీ మామయ్య చెప్తున్నాడురా" ఇరవై సంవత్సరాల క్రితం ఒక సాయం కాలపు వేళ అమ్మ ఆందోళనతో చెప్పింది.

"చూడనీ. మరి పెళ్ళి చెయ్యాలిగా?"

"అదేంటిరా? చిన్నప్పటి నుండి సీతకూ, నీకూ పెళ్ళి చెయ్యాలనిరా నా ఆశ."

నాకు భలే కోపం వచ్చింది.



"నీకు ఎన్నిసార్లు చెప్పానమ్మా? నాకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశం అసలు లేదని."

అమ్మ కళ్ళు నీటితో నిండడం చూశాను. మనస్సులో బాధ అనిపించి చెప్పాను. "అమ్మా నేనెవ్వరినీ పెళ్ళి చేసుకోను. పెళ్ళి నా సాహిత్యోపాసనకి అడ్డమ్మా!"

"బుద్ధి లేకపోతే సరి. రచయితలంతా ఇలా సన్యాసం పుచ్చుకొంటున్నారా?" అని కళ్ళు వత్తుకుంటూ వెళ్ళిపోయింది ప్రక్క గదిలోకి.

సీతకి పెళ్ళయింది. పిల్లలూ పుట్టారు. నా కలంలో నుంచి చాలా రచనలు పుట్టాయి. పేరు, ప్రతిష్ఠలు తెచ్చాయి. కానీ ఇప్పుడు ఈ పలభై ఆరో ఏట నేనొక ప్రేమికుడనైనానంటే నాకే నవ్వొస్తోంది.

ఈ వేళ సుమకి అన్నీ చెప్పేయాలి. ఇంకా మనస్సులో దాచుకొని ప్రయోజనం లేదు. కాని ఈ రోజు సుమ ఇంకా రాలేదు. కిటికీ దగ్గర కెళ్ళి చూశాను. వాన ఉధృతం కాస్త తగ్గినట్టుంది. ఆకాశమంతా మబ్బు కమ్మేసింది. తుపాను రాగలదన్న ఆకాశవాణి హెచ్చరిక నిజమయ్యేట్టే వుంది చూస్తుంటే.

దూరం నుంచి తెల్లని పరికిణీ, జాకెట్టు కనిపిస్తోంది. సుమ వస్తోందన్న మాట. మనస్సు కెంతో సంతోషం కలిగింది. అన్నీ చెప్పెయ్యాలివాళ. చెప్ప దలచిన మాటలు నెమరువేసుకొన్నాను గబగబా.

చేతుల్లో ఏదో పళ్లెంలాగుంది. గేటు దాటుతోంది సుమ.

వాకిట్లో నిలచిపోయిన వాన నీళ్ళు కాళ్ళతో చిమ్ముతూ వస్తున్న సుమని చూసి — టపాటపా కొట్టుకుంటోంది హృదయం.

"ఇదిగో మేష్టారూ ఇది మీ కోసం తెచ్చాను" అని పళ్లెం బల్ల మీద పడేసింది.

"ఏమిటది?"

"స్వీట్సు మా ఇంట్లో చేసినవే" నీలం రంగు జార్జెట్టు ఓణీతో తడిసిన తల తుడుచుకొంటూ అంది.

"ఈ వేళ శనివారం కదా? నేనేం తినను, పళ్ళు, పాలూ తప్ప."

"అయితే మీకూ ఈ ఉపవాసాల పిచ్చి వుందన్న మాట."

నా మాటలు మళ్ళీ దాక్కున్నాయి. ఆమె గురించి వ్రాసిన గేయం చేతిలోకి తీసుకొన్నాను. సుమ గేయం గురించి అడగదేం?

"ఈ వేళ మా ఇంట్లో విశేషమేంటో అడగరేం మాష్టారూ?"

నాకు నవ్వొచ్చింది ఆ అడిగే తీరుకి. కానీ నవ్వితే తనకి కోపం వస్తుందేమోనని నవ్వు ఆపుకొని అడిగేను.

"ఏమిటి విశేషం?"

సుమ బుగ్గలు ఎరుపెక్కాయి. సిగ్గుతో మొహం దించుకొని మెల్లగా అంది "నన్ను చూడడానికి ఎవరో వచ్చారు."

ఎవరో సుత్తితో నా తలపై కొట్టినట్టనిపించింది. పడిపోతానేమోనని కుర్చీని గట్టిగా పట్టుకొన్నాను.

"అన్నీ నిశ్చయం చేసే వెళ్ళారు వాళ్ళు. ఈ నెల్లోనే ముహూర్తం. ఆయనకి లీవు లేదట."

సుమ ఏదో చెబుతూనే వుంది. నాకేం వినిపించడం లేదు.

గదిలోనికి రివ్వున సుడిగాలి జల్లుతో పాటు వచ్చింది. తుపాను ప్రారంభమైనట్లుంది. ప్రపంచానికి వెలుగు తగ్గిపోయింది.

"మాష్టారూ మీరేం మాట్లాడరేమండీ?" నా వంక చూసింది సుమ. నేను కోపం దాచుకోలేకపోయాను. నా కంట్లో పెరిగే కోపాగ్నిని చూసి కాబోలు మొహం దించుకొని చెప్పింది. "నన్ను మన్నించండి మేష్టారూ. నిజంగా నాకూ ఇప్పుడే తెలిసింది. ముందుగా తెలిస్తే మీకు చెప్పేదాన్ని."

ఆ మాటలలోని దైన్యం నా మనస్సుని జాలిపరచలేదు. కోపంగా కిటికీ దగ్గర కెళ్ళి రోడ్డు వైపు చూస్తూ నిలుచున్నాను.

జడివాన పడుతోంది. గాలికి తట్టుకోలేక చెట్లు వూగిసలాడుతున్నాయి. ఎవ్వరూ లేరు కాబోలు. ఎక్కడికీ వెళ్ళలేకనే కాబోలు ఈ జడివానలో తడుస్తూ, చలికి వణుకుతూ ఒక కాకి చెట్టు మీద కూర్చుంది ఒంటరిగా.


"ఇక ఇది వరకటిలాగా రోజూ రావడం కుదరదేమో?" గుమ్మం వేపు వెళుతూ అంది సుమ.

"ఐనా మాష్టార్లూ నన్ను మర్చిపోవద్దని నా ప్రార్థన!" చేతులు జోడించి అలాగే వానలో తడుస్తూ పరుగెత్తింది.

చేతిలోని గేయాన్ని విసిరి పారేశాను. అది నీళ్ళలో ఈదుతూ వెళ్ళిపోయింది. ●

"సాహిత్య ప్రియులకు కావలసింది రసం. రసం అన్నది వాక్య నిర్మాణంలో పొటమరిస్తుందిగాని శబ్ద రూపాల్లోనూ, క్రియా రూపాల్లోనూ కాదు. వ్యావహారికంలో అయితే రచన 'నీరసం' అవుతుందనుకోవడమూ, గ్రాంథికం అయితే 'వాలు' రసమహితం' అయి పోతుందనుకోవడమూ రెండు నిదర్శనాలు గ్రాంథికం, వ్యాకరణ యుక్తం అయివుంటుందనుకోవడం అవివేకానికి మూడో నిదర్శనం" - అని శ్రీపాదవారి అభిప్రాయం.

— శరచ్చంద్రశేఖర్, కర్నూలు.

Nagarjuna Investment Trust Limited
96, Nagarjuna Hills, Punjagutta, Hyderabad-500 482 Phones 224403 37955 38066